క్లుప్తంగా

రోడ్డు వేయించాలని ఎమ్మెల్యేకు విన్నపం



ఎమ్మెల్యేను కలిసిన గ్రామస్తులు

చందుర్తి: మండలంలోని నర్సింగాపూర్ గ్రామం నుంచి జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం దమ్మయ్యపేట గ్రామం వరకు గల 10 కిలోమీటర్ల దూరం తారు రోడ్డు వేయించాలని నర్సింగాపూర్ గ్రామస్తులు స్థానిక ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబుకు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. నర్సింగాపూర్ గ్రామంలోని ముదిరాజ్ నుంచి లొంక శ్రీఆంజనేయ స్వామి దేవస్థానం మీదగా దమ్మయ్యపేట గ్రామం వరకు తారురోడ్డు వేసే ఈ ప్రాంత భక్తులతో పాటు కొడిమ్యాల మండలంలోని పలు గ్రామాల భక్తులకు రవాణా మార్గం అందుబాటులోకి వస్తుందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. సంబంధిత మంత్రితో మాట్లాడి నిధులు మంజూరుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో నర్సింగాపూర్ మాజీ ఎంపీటీసీ, సర్పంచ్ ఎర్రం శ్రీమన్నారాయణ, వార్డు సభ్యులు పూడూరి జీవన్‌రెడ్డి, మరాఠి దామోదర్, నేరెళ్ల రమేశ్, కొలకాని హరీశ్, పూడూరి ప్రశాంత్‌రెడ్డి, ముప్పిడి సత్తయ్య, చింతకుంట రమేశ్, కొలకాని రమేశ్, కాసారపు ప్రశాంత్‌రెడ్డి, బండి దేవరాజు, 40 మంది గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్మీ జూనియర్ ఆఫీసర్ రాజుకు పతకాలు



పతకాలతో ఆర్మీ జూనియర్ ఆఫీసర్ రాజు

చందుర్తి: మండలంలోని నర్సింగాపూర్ గ్రామానికి చెందిన ఆర్మీ జూనియర్ ఆఫీసర్ డాక్టర్ పేరుక రాజు రెండు పతకాలు సాధించాడు. పంజాబ్ రాష్ట్రంలోని పాకిస్థాన్ సరిహద్దులో భారతీయ డేరింగ్ సైనికులు ఈ పోటీలు నిర్వహించారు. మైగిఫ్ట్ స్వచ్ఛంద సంస్థతో పాటు ప్రముఖ కవిగా, అనువాదకుడిగా రాణించి డాక్టరేట్ సాధించిన రాజు ఫిజికల్, బాటిల్ ఎఫిసిఎన్సీ టెస్టులో తొలి స్థానంలో నిలిచి రెండు పతకాలను దక్కించుకున్నట్లు తెలిపారు. భారత సైన్యంతో పాటు పలు రంగాల్లో ప్రతిభను కనబర్చుతున్న రాజును గ్రామస్తులు అభినందించారు.

రైస్ మిల్లు తనిఖీ



రైస్ మిల్లును తనిఖీ చేస్తున్న తహసీల్దార్

తంగళ్లపల్లి: మండలంలోని కస్బేకట్కూర్ గ్రామ పరిధిలోగల రైస్ మిల్లును సోమవారం తంగళ్లపల్లి తహసీల్దార్ పి.సదానందం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైస్ మిల్లులో ధాధాన్యం వివరాలను అడిగి తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్‌తోపాటు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మధు ఉన్నారు.

రాజన్న సన్నిధిలో.. స్వచ్ఛంద సేవ

- మండుటెండను సైతం లెక్కచేయక
- సొంత ఖర్చులతో వేములవాడకు
- రాజన్న సేవలో తరిస్తున్న మహిళలు

వేములవాడ: ఎండలు మండుతున్నాయ్.. సొంత పనులుంటేనే వాయిదా వేసుకునే పరిస్థితి నెలకొంది. ఈ తరుణంలో తన సొంత పనులను పక్కన బెట్టి రాజన్న సేవలో అంకితమవుతున్నారు వివిధ జిల్లాలకు చెందిన మహిళలు. వయస్సుతో సంబంధం లేదు.. చేసే ఉద్యోగంతో సంబంధం లేదు.. చదువులతో ఎలాంటి ఇబ్బందులు లేవు. అన్నింటినీ పక్కనబెట్టి పార్వతీ పరమేశ్వరుడు కొలువున్న వేములవాడకు సొంత ఖర్చులతో చేరుకుని స్వచ్ఛందంగా సేవలందిస్తున్నారు. పక్షం రోజులుగా ఎండలు తీవ్రస్థాయిలో ఉన్నప్పటికీ రాజన్న భక్తులకు ప్రసాదాలు తయారు చేసే గోదాంలో ఉక్కపోతను సైతం లెక్కచేయకుండా స్వచ్ఛందంగా పనిచేస్తూ పలువురు మన్ననలు పొందుతున్నారు. లడ్డూలు తయారు చేసే విభాగం, క్యూలైన్లలో తాగునీటి సరఫరా, క్యూలైన్లను క్రమబద్ధీకరించడం, లడ్డూ కౌంటర్‌లో, అన్నదాన సత్రంలో ఉద్యోగులతో సమానంగా పనులు చేస్తున్నారు. ఇంతే కాకుండా రాజన్న హుండీ లెక్కింపులో కనీసం 400 మందికి తగ్గకుండా వేములవాడకు చేరుకుని పొద్దంతా హుండీ కౌంటింగ్‌లో సేవలందిస్తున్నారు. వీరి సేవలకు భక్తజనం సలాం కొడుతున్నారు. వీరు చేస్తున్న సేవల్లో ఎలా ఫీలవుతున్నారో వారి మాటల్లోనే చూద్దాం.



లడ్డూలు చేస్తున్న యువతులు



ఈ చిత్రంలో కనిపిస్తున్న అమ్మలంతా ఆర్మూర్ ప్రాంతంలోని నడికుడకు చెందిన వారు. రాజన్నకు ఉచితంగా సేవలందించేందుకు సొంత ఖర్చులతో వేములవాడకు చేరుకున్నారు. ఇప్పటి వరకు చాలాసార్లు రాజన్న సేవలో తరించినట్లు చెబుతున్నారు. శివుడి సన్నిధిలో శ్రమదానం చేయాలన్నదే తమ ఉద్దేశ్యమని చెబుతున్నారు. అధికారులు ఎక్కడ అవకాశం కల్పిస్తే అక్కడే సేవలందిస్తున్నట్లు చెబుతున్నారు.



రాజన్న హుండీ లెక్కింపులో మహిళలు



ఈ చిత్రంలో కనిపిస్తున్న వారు కామారెడ్డికి చెందిన వారు. బిందురెడ్డి ఎమ్మెస్సీ పూర్తి చేయగా, రుచితారెడ్డి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. తమ పూర్వీకులు సైతం రాజన్నకు ఉచితంగా సేవలందించారని అమ్మమ్మ, నానమ్మలు, పెద్దమ్మలు చెబుతుంటే విని తామే స్వయంగా కామారెడ్డి నుంచి వేములవాడకు చేరుకుని లడ్డూలు తయారు చేసే విభాగంలో సేవలందిస్తున్నారు. పరమేశ్వరుడికి సేవలందిస్తే తాము మదిలో అనుకున్నది జరుగుతుందని అంటున్నారు. రెండోసారి సేవలందిస్తున్నామని సంతోషంగా చెబుతున్నారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న రాజేశ్వరి, శ్రీలక్ష్మి ఐదేళ్లుగా రాజన్న సేవలో తరిస్తున్నారు. హుండీ కౌంటింగ్ మొదలుకుని లడ్డూల తయారీ, క్యూలైన్లలో సేవలు చేసినట్లు చెబుతున్నారు. తమ కుటుంబాలు బాగుండాలనీ, దేశం సుభిక్షంగా ఉండాలని మొక్కుకుంటున్నట్లు చెబుతున్నారు.

పవర్ కట్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బోయినపల్లి: మండలంలోని విలాసాగర్, బోయినపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో ఈ నెల 16 నుంచి 23 వరకు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని సెస్ ఏఈ రంగు నగేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్టీ లైన్ల తనిఖీలో భాగంగా విద్యుత్ లైన్లపై పడే చెట్ల కొమ్మల నరికివేతతో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందన్నారు. బోయినపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని తడగొండ స్టేజీ, బోయినపల్లి, రామన్నపేట, రత్నంపేట, మర్లపేట గ్రామాల్లో, విలాసాగర్ సబ్‌స్టేషన్ పరిధిలో విలాసాగర్, దేశాయిపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

సమాచారం

17న మినీ జాబ్ మేళా

సిరిసిల్లకల్చరల్: హైదరాబాద్‌లోని సుచిత్ర ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్సు, వరుణ్ మోటార్స్ వంటి ప్రైవేట్ కంపెనీల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ కోసం ఈ నెల 17న మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి నీల రాఘవేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నర్సింగ్ కళాశాల పక్కన గల అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించే జాబ్ మేళాకు జిల్లాకు చెందిన ఎస్సెస్సీ, ఇంటర్మీడియెట్, ఐటీఐ విద్యార్హతలు గల నిరుద్యోగ యువతీ, యువకులు హాజరు కావచ్చునన్నారు. ఎంపికైన వారికి రూ.15 నుంచి రూ.20 వేల నెలసరి వేతనం లభిస్తుందన్నారు. ఆసక్తి గల వారు తమ బయోడేటా, విద్యార్హతల ధ్రువీకరణ పత్రాలతో నేరుగా జాబ్ మేళాకు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 98660 19366, 99856 78292 సెల్ నెంబర్లలో సంప్రదించాలన్నారు.

20న సర్వసభ్య సమావేశం

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 20న జరగనున్నట్లు ఎంపీడీవో రాంరెడ్డి తెలిపారు. ఎంపీపీ బండ మల్లేశం అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి అన్ని శాఖలపై సమీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు, సభ్యులు హాజరుకావాలని ఆయన కోరారు.

నియామకం

కాంగ్రెస్ చొప్పదండి ఎల్‌డీఎంగా 'సంగీతం'

సిరిసిల్లటౌన్: కాంగ్రెస్ చొప్పదండి నియోజకవర్గం లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ మిషన్ కోఆర్డినేటర్‌గా సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ నియమిసస్తూ సోమవారం ఏఐసీసీ ఎస్సీ విభాగం చైర్మన్ రాజేష్‌లిలోతియా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

కల్యాణ వైభోగం



వీర్నపల్లి: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న బీరప్ప–కామరాతిల కల్యాణ మహోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం బియ్యం సుంకు, డోలు చప్పుళ్లు, ఒగ్గు కళాకారుల విన్యాసాల మధ్య మహిళలు బోనాలతో శివసత్తుల పూనకాల మధ్య యాదవ, కురుమ కుటుంబీకులు ఆలయానికి చేరుకున్నారు. అనంతరం లింగాలకు గంగ స్నానం చేయించి ఆలయానికి తీసుకొచ్చారు. ఆలయ ఆవరణంలో పెద్దపట్నం వేసి బీరప్ప–కామరాతి కల్యాణాన్ని జరిపించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కల్యాణ మహోత్సవానికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మండల జెడ్పీటీసీ గుగులోత్ కళావతి, ఎంపీపీ మాలోత్ భూల, సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, ఎంపీటీసీ మల్లారపు అరుణ్‌కుమార్,'సర్పంచ్ పాటి దినాకర్, ఉపసర్పంచ్ బోయిని రవి, నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కొనసాగుతున్న వీవోఏల నిరసన



వేములవాడలో నిరసన దీక్షలో ఐకేపీ వీవోఏలు



కోనరావుపేటలో మద్దతు ప్రకటిస్తున్న ఎల్లారెడ్డి

వేములవాడరూరల్: తమ డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని ఐకేపీ వీవోఏలు చేపడుతున్న నిరసన సోమవారంకు పదో/ రోజుకు చేరింది. అన్ని గ్రామాల నుంచి తరలివచ్చి ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరసనలో పాల్గొంటున్నారు. వీరికి అన్ని పార్టీల నాయకులు మద్దతు తెలుపుతూ వారు కోరుతున్న డిమాండ్లు న్యాయపరమని, ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలంటూ వారికి అండగా నిలుస్తున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి స్పందన లేదు. ప్రభుత్వం స్పందించే వరకు తమ ఆందోళన ఆగేది లేదంటూ వారు అంటున్నారు. ఈ కార్యక్రమంలో అన్ని గ్రామాల ఐకేపీ వీవోఏలు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

కోనరావుపేట: గ్రామాల్లో సేవలందిస్తున్న వీవోఏల సమస్యలు పరిష్కరించి, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి డిమాండ్ చేశారు. కోనరావుపేట మండల కేంద్రంలో వీవోఏలు చేస్తున్న సమ్మెకు మద్దతు ప్రకటించి సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో పనిచేస్తున్న వీవోఏల వేతనాలను వారి ఖాతాల్లో జమచేయకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, నేరుగా వారి ఖాతాల్లోనే జమ చేయాలన్నారు. అలాగే వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే వీవోఏలకు గౌరవ వేతనం రూ.26 వేలు అందించి, రూ .10 లక్షల బీమా సదుపాయాన్ని కల్పించాలన్నారు. ఈ సమ్మెలో జిల్లా నాయకులు జవ్వాజి విమల అన్ని గ్రామాల వీవోఏలు పాల్గొన్నారు.

కేటీఆర్ ట్రోఫీ జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న గోపాల్‌రావు

ముస్తాబాద్: కేటీఆర్ ట్రోఫీ జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కల్వకుంట్ల గోపాల్‌రావు సోమవారం ప్రారంభించారు. బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీల్లో రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాలకు చెందిన 50 క్రికెట్ జట్లు పాల్గొంటున్నాయి. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు మహ్మద్ నవాజ్, ఎంపీపీ శరత్‌రావు, జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, సర్పంచ్ సుమతి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్‌రావు పాల్గొన్నారు.

పేదలకు అందుబాటులో వైద్య సేవలు

- కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభం
- ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ బాబు



కంటి వెలుగును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణం 17వ వార్డులోని ఆర్యవైశ్య సత్రంలో కంటి వెలుగు కేంద్రాన్ని ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుపేద ప్రజలకు అందుబాటులోనే వైద్య సేవలు అందుతున్నాయన్నారు. వేములవాడలో ఇప్పటి వరకు 18 వేల మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. అవసరమున్న 4 వేల మందికి కంటి అద్దాలను ఉచితంగా అందజేశామన్నారు. వేములవాడ ఏరియా ఆసుపత్రిలో కంటి అపరేషన్లు కూడా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి కృష్ణవేణి, కమిషనర్ అన్వేశ్, కౌన్సిలర్ చింతపంటి దివ్య పాల్గొన్నారు.

సిరిసిల్లటౌన్: సిరిసిల్లలోని 22వ వార్డులో కంటివెలుగు కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెల్దండి సమ్మయ్య, కౌన్సిలర్ కల్లూరి లత, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, కల్లూరి మధు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని చిన్నారుల వేడుకోలు



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న చిన్నారులు

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఇద్దరు చిన్నారులు సోమవారం ప్రజావాణిలో తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించిన సంఘటన కదిలించింది. మండల కేంద్రానికి చెందిన ఒగ్గు శ్రీనిధి, ఒగ్గు ప్రశాంత్ తహసీల్దార్‌ను కలిసి, తమ సోదరుడు ఒగ్గు వికాస్ ఈ విద్యా సంవత్సరంలో ఇంటర్ పూర్తి చేశాడని, వెయ్యికి 951 మార్కులు సాధించాడని, స్థానికంగా డిగ్రీ కళాశాల లేకపోవడంతో, తమ సోదరుడి ఉన్నత చదువు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. వికాస్ లాగానే అనేక మంది విద్యార్థులు ఇంటర్ పూర్తిచేసి డిగ్రీ చదువుకు దూర ప్రాంతాలు, ప్రైవేట్ కళాశాలల్లో చదువలేక ఉన్నత విద్యకు దూరెమవుతున్నట్లు చిన్నారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి స్థానికంగా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సీఎం కప్ క్రీడలు ప్రారంభం



తంగళ్లపల్లిలో ప్రారంభిస్తున్న ఎంపీపీ మానస



వీర్నపల్లి: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ముస్తాబాద్: ముస్తాబాద్‌లో సీఎం కప్ క్రీడా పోటీలను ఎంపీపీ జనగామ శరత్‌రావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ఆవిర్భావానికి పదేళ్లు గడుస్తున్న శుభ సందర్భంగా ప్రభుత్వం క్రీడా పోటీలను నిర్వహిస్తోందన్నారు. మండల స్థాయిలో పోటీల అనంతరం జిల్లా స్థాయి పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేస్తారన్నారు. జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, రైతుబంధు సమితి అధ్యక్షుడు గోపాల్‌రావు, సర్పంచ్ సుమతి, ఎంపీడీవో రమాదేవి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్‌రావు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: పద్మనగర్ గ్రామ పరిధిలోని కస్తూర్బా బాలిక విద్యాలయంలో మండల స్థాయిలో సీఎం కప్ క్రీడలు ఎంపీపీ పడిగెల మానస ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ ముదారి పోచయ్య, డీఈవో రమేశ్‌కుమార్, తహసీల్దార్ పి.సదానందం, ఎంపీడీవో లచ్చాలు, ఎస్ఐ పి.లక్ష్మారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ దేవదాస్, వైస్‌చైర్మన్ రమణారెడ్డి, జాగృతి అధ్యక్షుడు రామాగౌడ్ పాల్గొన్నారు.

వీర్నపల్లి: స్థానిక ఆదర్శ పాఠశాల క్రీడా మైదానంలో సీఎం కప్ ఆటల పోటీలను ఎంపీపీ మాలోత్ భూల, జెడ్పీటీసీ గుగులోత్ కళావతి ప్రారంభించారు. ఎంపీడీవో నరేశ్‌కుమార్, తహసీల్దార్ తాఫజుల్ హుసేన్, సర్పంచ్ దినాకర్, ఎంపీటీసీ అరుణ్‌కుమార్, సెస్ డైరెక్టర్ మల్లేశం, ఉప సర్పంచ్ బోయిని రవి, బంజార సేవలాల్ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేశ్‌నాయక్ పాల్గొన్నారు.

నేటి నుంచి సీఎం కప్ పోటీలు

సిరిసిల్లటౌన్: స్థానిక మినీస్టేడియంలో ఉదయం 9 గంటల నుంచి వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్, రన్నింగ్ 100, 400, లాంగ్‌జంప్, హైజంప్, షార్ట్‌పుట్ క్రీడలు నిర్వహిస్తామని కమిషనర్ సమ్మయ్య తెలిపారు. 15 నుంచి 35 ఏళ్లలోపు స్త్రీ, పురుషులు అర్హులని, పాల్గొనే వారు పీఈటీలు రవీందర్‌రావు 94400 93987, ఎస్.బాబు 94403 50422 సంప్రదించాలన్నారు.

భారీగా ధాన్యం కొనుగోళ్లు

బోయినపల్లి: మండలంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బోయినపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధిలోని గ్రామాల రైతుల వరి ధాన్యం పెద్ద మొత్తంలో కొనుగోలు చేసినట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ లెంకల సత్యనారాయణరెడ్డి తెలిపారు. మండలంలో 939 మంది రైతుల వద్ద నుంచి 61,789 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఇందులో 753 మంది రైతులకు వారి బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అయినట్లు వివరించారు. సర్పంచ్ లతశ్రీ పాల్గొన్నారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలి

సిరిసిల్లఅర్బన్: ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని కోరుతూ జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్ అనురాగ్ జయంతికి సోమవారం వినతిపత్రం ఇచ్చారు. అనంతం ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం చేస్తూ, లారీల కొరత లేకుండా చూడాలన్నారు. ఇటీవల కురిసిన వడగండ్ల వానకు ధాన్యం రాలిపోయి, రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలన్నారు. జిల్లా మైనారిటీ అధ్యక్షుడు సాహేబ్ పాల్గొన్నారు.

ప్రజలకు రాజ్యాంగ పుస్తకం అందించాలి

సిరిసిల్లటౌన్: రాజ్యాంగ పుస్తకాన్ని దేశ పౌరులందరికీ పంచాలని డీఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు. రాజ్యాంగంపై ప్రతి పౌరుడికి అవగాహన కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయని పేర్కొంటూ సోమవారం జిల్లాకేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. డీఎస్పీ జిల్లా కన్వీనర్ కీర్తనప్రకాశ్ పాల్గొన్నారు.

సూపరింటెండెంట్‌కు ఎంపీవోగా అదనపు బాధ్యతలు

తంగళ్లపల్లి: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండల పంచాయతీ అధికారి (ఎంపీవో)గా కార్యాలయ సూపరింటెండెంట్ విజయేందర్‌రెడ్డికి అధనపు బాధ్యతలను అప్పగించారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి ఎంపీవోగా వ్యవహరించిన గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శి శ్రీధర్‌రెడ్డిని ఎంపీవో బాధ్యతల నుంచి రిలీవ్ చేస్తూ కలెక్టర్ అనురాగ్ జయంతి ఉత్తర్వులు జారీ చేశారు.

సాలోమోను రాజును ఎమ్మెల్సీగా నామినేట్ చేయాలి

సిరిసిల్లటౌన్: గోనె సాలోమోను రాజును ఎమ్మెల్సీగా నామినేట్ చేయాలని సీఎం కేసీఆర్‌ను జిల్లా పాస్టర్స్ అసోసియేసన్ ప్రతినిధులు కోరారు. ఈమేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అన్ని క్రైస్తవుల సంఘాలు, ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉన్న గోనె సాలోమోను రాజును గవర్నర్ కోటా కింద క్రిస్టియన్ ఎమ్మెల్సీగా నామినేట్ అసోసియేషన్ అధ్యక్షుడు సామ్‌కల్వల, సన్నీమోసిస్, కిరణ్, వినయ్, రాజు, దేవానంద్ కోరారు.

ఉపాధి పనుల పరిశీలన

ఇల్లంతకుంట: మండలంలోని జంగంరెడ్డిపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఎంపీడీవో మీర్జా, ఏపీవో చంద్రయ్య సోమవారం పరి శీలించారు.

మండల సమావేశం వాయిదా

వేములవాడఅర్బన్: వేములవాడ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం వాయిదా వేసినట్లు ఎంపీడీవో శ్రీధర్ తెలిపారు. అధికారులు హాజరైనప్పటికీ, కోరం లేక మండల సర్వసభ్య సమావేశం వాయిదా వేసినట్లు అయన తెలిపారు.

డబుల్ బెడ్రూం కేటాయింపులు

సిరిసిల్లటౌన్: ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 18న నాలుగో విడత డబుల్‌బెడ్రూం ఇళ్లను కేటాయిస్తున్నట్లు కమిషనర్ సమ్మయ్య తెలిపారు. జిల్లాకేంద్రం సమీపంలో నిర్మించిన సముదాయాల్లోని ప్లాట్లకు గురువారం సాయంత్రం 4 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సభ్యుల సమక్షంలో డ్రా నిర్వహిస్తామన్నారు. ఎంపికైన అభ్యర్థుల జాబితాను తదుపరి ప్రకటిస్తామని వివరించారు.

లక్ష్మారెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన కేకే

సిరిసిల్లటౌన్: రాజకీయంగా, న్యాయవాదిగా, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలకు దోర్నాల లక్ష్మారెడ్డి చేసిన సేవలు మరువలేనివని కాంగ్రెస్ నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం సిరిసిల్లలోని లక్ష్మారెడ్డి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఉమ్మడి జిల్లా పరిషత్ మాజీ వైస్‌చైర్మన్‌గా, సిరిసిల్ల సెస్ మాజీచైర్మన్‌గా, నాలుగు దశాబ్దాలుగా సీనియర్ న్యాయవాదిగా లక్ష్మారెడి ప్రస్థానం అందరికీ ఆదర్శం అన్నారు. ఆయనతో పాటు టౌన్ క్లబ్ ప్రెసిడెంట్ చొప్పదండి ప్రకాశ్, న్యాయవాది దోర్నాల లక్ష్మారెడ్డి, తిరుపతి, మునిగెల రాజు పాల్గొన్నారు.